# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 01-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ మానవ వనరులు దేశానికి అతిపెద్ద బలమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- ❖ ఉప రాష్ట్రపతి ఎన్నికకు వచ్చే నెల 9వ తేదీన పోలింగ్ జరగనుందని భారత ఎన్నికల సంఘం ప్రకటించింది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ఉత్తరప్రదేశ్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు.
- ❖ ఆపరేషన్ సిందూర్ సమయంలో సైనిక చర్యను నిలిపివేయాలనే చర్చ భారత్-పాక్ దేశాల మధ్య నేరుగా జరిగిందని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ స్పష్టం చేశారు.
- ❖ భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న 5వ క్రికెట్ టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 6 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ లక్ష్య సాధనకు విద్యార్థులు ఉత్ప్రేరకంలా వ్యవహరించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. ఈరోజు ఆమె IIT ISM ధన్‌బాద్ 45వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... సమస్యలకు సరళమైన పరిష్కారాలు అందించేలా నూతన సాంకేతిక విధానాలను అవలంబించాలని విద్యార్థులకు సూచించారు. అత్యాధునిక సాంకేతికతలతో ఉత్తమ ఇంజనీర్లను తయారు చేయడంలో ఐఐటీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. మానవాళి పట్ల కరుణ, సున్నితత్వం, సానుభూతితో ఉండాలని ఉద్బోధించారు. అపారమైన మానవ వనరులే భారతదేశానికి అతిపెద్ద బలమని పేర్కొంటూ....

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి వచ్చే నెల 9వ తేదీన పోలింగ్ జరగనుందని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఈరోజు ప్రకటించింది. ఈ నెల 7వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందని, నామినేషన్ల దాఖలకు చివరి తేదీ ఆగస్టు 21 అని పేర్కొంది. నామినేషన్ల పరిశీలన ఈ నెల 22 వరకు జరుగుతుందని, నామినేషన్ల ఉపసంహరణకు 25వ తేదీ వరకు సమయం ఉంటుందని తెలిపింది. వచ్చే నెల 9న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య పోలింగ్ జరిగి, అదే రోజు లెక్కింపు జరుగుతుందని ఎన్నికల సంఘం వివరించింది. కాగా.. నూతన ఉపరాష్ట్రపతి పదవీ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుండి పూర్తి ఐదేళ్లు పదవిలో కొనసాగుతారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ఉత్తరప్రదేశ్ లోని వారణాసి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా సుమారు 2 వేల 200 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. వారణాసిలో పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. అలాగే వివిధ రహదారి విస్తరణ పనులు, జల్ జీవన్ మిషన్ కింద 47 గ్రామీణ తాగునీటి పథకాలను, 53 పాఠశాల భవనాల ఆధునీకరణ పనులను ప్రారంభిస్తారు. ప్రధానమంత్రి ఒక బహిరంగ సభలో పాల్గొని.. PM-KISAN 20వ విడత కింద దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాలకు 20 వేల 500 కోట్ల రూపాయల మొత్తాన్ని బదిలీ చేయనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ఆర్థిక వ్యవస్థపై కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు సరికాదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ... రాహుల్ గాంధీ పదే పదే దేశ వ్యతిరేక ప్రకటనలు చేస్తున్నారని, వాటిని పలువురు ప్రతిపక్ష నేతలు సైతం ఖండించారన్నారు. రాహుల్ గాంధీ ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతూ రాజ్యాంగ సంస్థలను బెదిరిస్తున్నారని, ఇది ప్రమాదకరమైన విధానమని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలను అప్రతిష్టపాలు చేసేందుకు ప్రతిపక్షాలు దురుద్దేశపూరితంగా వ్యవహరిస్తున్నాయని కేంద్రమంత్రి ఆరోపించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ చలన చిత్ర అవార్డులను ఈరోజు ప్రకటించారు. ఉత్తమ నటుడి విభాగంలో బాలీవుడ్ నటులు షారుఖ్ ఖాన్, విక్రాంత్ మాస్సే లకు పురస్కారాలు లభించగా.. రాణి ముఖర్జీకి ఉత్తమ నటి అవార్డు లభించింది. 12th ఫెయిల్ ఉత్తమ చిత్రంగా జాతీయ చలనచిత్ర అవార్డును గెలుచుకుంది. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన తెలుగు చిత్రం భగవంత్ కేసరి చిత్రానికి ఉత్తమ జాతీయ చిత్రంగా పురస్కారం లభించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆపరేషన్ సిందూర్ సమయంలో సైనిక చర్యను నిలిపివేయాలనే చర్చ భారత్-పాక్ దేశాల మధ్య నేరుగా జరిగిందని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ స్పష్టం చేశారు. ఈరోజు ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ.. ఇరు దేశాల సాయుధ దళాల మధ్య చర్చ జరిగిందని, కాల్పుల విరమణ కోసం అభ్యర్థన తొలుత పాకిస్తాన్ నుండి వచ్చిందని పేర్కొన్నారు. పాకిస్తాన్‌తో ఏవైనా అపరిష్కృత సమస్యలుంటే ద్వైపాక్షికంగా మాత్రమే చర్చిస్తామని అమెరికా అధ్యక్షుడితో సహా అన్ని దేశాలకు భారత్ స్పష్టం చేసిందని ఆయన ఉద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన 25 శాతం టారిఫ్ కారణంగా భారత్‌లో ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటించబడిందంటూ పాకిస్థాన్‌కు చెందిన ఒక సామాజిక మాధ్యమంలో వచ్చిన వార్తలను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ)కు చెందిన నిజ నిర్ధారణ కమిటీ ఈ సమాచారాన్ని నకిలీదిగా నిర్ధారించింది. భారతదేశంలో ఎటువంటి ఆర్థిక అత్యవసర పరిస్థితిని ప్రకటించలేదని స్పష్టం చేసింది. ఇటువంటి అంశాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ... సరైన సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్లు, సమాచార మాధ్యమాలపై మాత్రమే ఆధారపడాలని విజ్ఞప్తి చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజ్యసభ సమావేశాల్లో పలు సమస్యలకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల నుండి ఈరోజు 30 వాయిదా నోటీసులు అందాయని డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ తెలిపారు. అయితే వాటిని తిరస్కరించినట్టు ఆయన పేర్కొన్నారు. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్‌పై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయగా.. ఎన్నికల సంఘం రాజ్యాంగ బద్ధమైన సంస్థ కాబట్టి ఈ విషయంపై చర్చను అనుమతించలేదని ఆయన పేర్కొన్నారు. కాగా.. మధ్యాహ్నం జరిగిన సమావేశంలో డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్, (DPDP) చట్టం -2023 అమలుకు సంబంధించిన ప్రశ్నలకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిచ్చారు. అయితే బీహార్ ఓటర్ల జాబితాకు సంబంధించి చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ.. సభ్యులు ఆందోళన చేపట్టడంతో సభ సోమవారానికి వాయిదా పడింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజకీయ పార్టీలను కూడా లైంగిక వేధింపుల నిరోధక చట్టం పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ.. దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిఐఎల్) సుప్రీంకోర్టు ఈరోజు కొట్టివేసింది. ఇది విధానపరమైన అంశమని, పార్లమెంట్ పరిధిలోకి వస్తుందని, తాము జోక్యం చేసుకోలేమని ప్రధాన న్యాయమూర్తి బీ.ఆర్. గవాయ్, కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ వ్యాఖ్యానించింది. కాగా.. రాజకీయ పార్టీలతో పని చేసే వ్యక్తులకు లైంగిక వేధింపుల నుండి రక్షణ కల్పించేలా POSH చట్టం పరిధిని విస్తరించాలని పిటిషనర్ తరపు న్యాయవాది శోభా గుప్తా సుప్రీం కోర్టును అభ్యర్థించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జమ్మూ నుండి అమర్‌నాథ్ యాత్ర వరుసగా రెండవ రోజు నిలిచిపోయింది. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన యాత్రికులను.. వాతావరణ పరిస్థితిని సమీక్షించిన తర్వాత వారి తదుపరి ప్రయాణం కోసం పహల్గాం, బల్తాల్ బేస్ క్యాంపులకు వెళ్లడానికి భగవతి నగర్ బేస్ క్యాంపులో ఉంచినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాల రెండవదశలో దేశవ్యాప్తంగా సగటు కంటే 106 శాతం అధికంగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. ఆగస్టు నుండి సెప్టెంబర్ వరకు దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని IMD డైరెక్టర్ జనరల్ ఎం.మొహాపాత్ర తెలియజేశారు. ఈశాన్య ప్రాంతం, దానిని ఆనుకొని ఉన్న తూర్పు ప్రాంతాలు, మధ్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలతో పాటు దేశ నైరుతి ప్రాంతంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు.

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

లండన్‌లోని ఓవల్ స్టేడియం వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదవ క్రికెట్ టెస్ట్ మ్యాచ్ లో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో ఇప్పటి వరకూ 6 వికెట్ల నష్టపోయి 215 పరుగులు చేసింది. భారత్ బౌలర్లలో మహ్మద్ సిరాజ్ 3 వికెట్లు తీశాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =